ప్రజాశక్తి

శనివారం 20 డిసెంబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



మౌన దీక్షలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు

మహాత్ముని పేరు తొలగింపునకు కుట్ర

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు
- నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని సిపిఎం మౌన దీక్ష
- ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో కేంద్రం వైఖరిపై ఆగ్రహం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన విబి– జిఆర్‌ఎఎంజి బిల్లుపై ప్రతిపక్షాలతో పాటు రైతు, ప్రజా సంఘాల నుంచి ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. కరువు ప్రాంతాలలో సైతం గ్రామీణ కార్మికులకు ప్రయోజనకరంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తూ దాని స్థానంలో మోటీ సర్కార్ తీసుకొచ్చిన విబి– జిఆర్ ఎఎంజి బిల్లును వ్యతిరేకిస్తూ సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన శుక్రవారం ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో పలుచోట్ల నిరసన కార్యక్రమాలు పట్టారు. విజయవాడ వన్‌టౌన్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద గల మహాత్మా గాంధీజీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నల్ల రిబ్బన్లు నోటికి కట్టుకుని మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు మాట్లాడుతూ మహాత్ముని పేరు తొలగింపునకు బిజెపి ప్రభుత్వం పన్నాగం పన్నిందని మండిపడ్డారు. మోదీ సర్కార్ గాడ్సేను నెత్తిన పెట్టుకొని గాంధీజీని చరిత్ర పుటల్లో నుంచి తొలగించాలని కుట్ర పన్నుతోందని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోందంటూ పదేపదే పేర్కొంటున్న కూటమి నేతలు నూతన చట్టంపై నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. నూతన చట్టం రాకతో రాష్ట్ర ప్రభుత్వం పై నాలుగు వేల కోట్ల రూపాయల అదనపు భారం పడనుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, పశ్చిమ సిటీ కార్యదర్శి, విఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత కార్మికులు ఆర్థిక భరోసానిచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వారి నోట్లో మట్టి కొట్టాలని చూస్తోందని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, సెంట్రల్, ఈస్ట్ సిటీల కార్యదర్శులు బి.రమణరావు, పి.కృష్ణ, నాయకులు కె.దుర్గారావు, ఈవి నారాయణ, సూరిబాబు, బి.చిన్నారావు, బి చిన్నారావు, రమణ పాల్గొన్నారు.

(మిగిలిన వార్తలు లోపలి పేజీల్లో)

డిఆర్‌సిలో చిటపటలు !

- పశువైద్యశాలల్లో మందులు లేవు
- అన్నదాత సుఖీభవ కౌలు రైతులకూ ఇవ్వాలి
- డిఆర్‌సిలో సమస్యలు ఏకరువుపెట్టిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మత్స్య , గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులు పనితీరుపైన, డి ఆర్ సి జాప్యంపై పలువురు ఎమ్మెల్యేలు చిటపటలాడారు. రహదారులు అభివద్ధి , సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం చొరవ చూపాలన్నారు. శుక్రవారం మచిలీపట్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్ష మండలి (డిఆర్ సి) సమావేశం జరిగింది. జిల్లా ఇన్ ఛార్జీ మంత్రి వాసంశెట్టి సుభాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు శాఖల పనితీరును సమీక్షించారు. ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్లలో జాప్యం నివారించేందుకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుతామన్నా అధికారులు స్పందించడంలేదని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగాయలంక మండలంలో తుఫానుకు నష్టపోయిన ఆక్వా రైతులను ఎన్యూమరేషన్ చేయలేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఎస్సైన్డ్, ప్రభుత్వ అనాదీన భూముల్లోని ఆక్వా చెరువులను నమోదు చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించలేదని మత్స్యశాఖ అధికారి తెలిపారు. పేదలు ఆక్వా సాగు చేస్తున్న ఈ భూములను రిజిస్ట్రేషన్ చేయకపోవడం అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో, సమస్యగా మారుతుందని, ఈ ఆక్వా చెరువులను రిజిస్ట్రేషన్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపచేయాలని , లంక భూముల్లో రైతులకు ఈ పథకం అందలేదని , అన్నదాత సుఖీభవ సమస్యలపై గ్రీవెన్స్ ఆప్షన్ ఇవ్వలేదని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి సమావేశంలో ప్రస్తావించారు. పశు వైద్యశాలల్లో మందులు అందుబాటులో లేవని , కొన్ని ఆసుపత్రుల్లో వైద్యులు లేక పశువులకు వైద్యం అందడం లేదని పామర్రు, పెనమలూరు ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా ,బోడె ప్రసాద్ ప్రస్తావించారు. దివిసీమ ప్రాంతంలో డ్రెయిన్లు పై ఔట్ ఫాల్ స్లూయిస్ల నిర్మాణం చేయాల్సి ఉందని మండలి బుద్ధప్రసాద్ అన్నారు. వాటర్ ట్యాంక్ స్థలంపై మార్పు వ్యవహారాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కష్ణ ప్రసాద్ ప్రస్తావించారు. దీనిపై థర్డ్ పార్టీ విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగుతీస్తామని మంత్రి కొల్లు అన్నారు.



డిఆర్‌సిలో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

సమావేశం జాప్యంపై మండలి అసహనం

జిల్లా స్థాయిలో సమీక్షించాల్సిన సమస్యలు చాలా ఉన్నాయి. జిల్లా సమీక్ష మండలి సమావేశానికి చాలా ప్రాధాన్యత ఉందని గుర్తించాలి. సమావేశాన్ని ఆలస్యం చేయడంతో సమస్యలపై చర్చించే అవకాశం ఉండదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. రోజంతా చర్చ జరిగేలా ప్రతి మూడు నెలలకు ఒకసారి సకాలంలో డి ఆర్ సి నిర్వహిస్తామని మంత్రి కొల్లు సమాధానం ఇచ్చారు. 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్, జడ్ పి చైర్ పర్సన్ ఉప్పల హారిక, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు , ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లా కలెక్టర్ డి.కే.బాలాజీ, జాయింట్ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికీకరణ తీరుతెన్నులు - రాష్ట్ర ప్రభుత్వ విధానాలు'పై స్మారకోపన్యాసం

విజయవాడ : స్వాతంత్ర్య సమరయోధులు, మార్క్సిస్టు సిద్ధాంతకర్త మాకినేని బసవపున్నయ్య 111వ జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం 5.30 గంటలకు "ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికీకరణ తీరుతెన్నులు – రాష్ట్ర ప్రభుత్వ విధానాలు' అన్న అంశంపై స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు ఎంబి విజ్ఞాన కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రం చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బి.వి.రాఘవులు ఉపన్యసిస్తారు. ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు అధ్యక్షత వహిస్తారు.

వార్త 2లో



స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లా క్రికెట్ ఛాంప్ విశాఖ

రూ.10 కోసం వ్యక్తి హత్య

వార్త మెయిన్‌లో



దట్టమైన పొగ మంచుతో ఢిల్లీ విమానం రద్దు

పలు విమానాలు ఆలస్యం

ప్రజాశక్తి - గన్నవరం : దట్టమైన పొగమంచు కారణంగా శుక్రవారం గన్నవరం విమానాశ్రయం నుంచి పలు విమానాల రాకపోకలు గంటలతరబడి ఆలస్యం అయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఉదయం విమానాశ్రయం చుట్టూ దట్టమైన పొగమంచు కమ్మేయింది. దీంతో ఢిల్లీ నుంచి రావాల్సిన ఎయిర్ ఇండియా విమానాన్ని రద్దు చేశారు. అలాగే బెంగళూరు, హైదరాబాద్ నుంచి రావాల్సిన విమానాలు మూడు గంటలకుపైగా ఆలస్యంగా చేరుకున్నాయి. దీంతో విమానాశ్రయంలో వేచి ఉన్న ప్రయాణీకులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఇబ్బందులకు గురయ్యారు. వాతావరణ పరిస్థితులు అనూహ్యంగా మారడంతో విమానసేవలపై ప్రభావం చూపినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ప్రపంచానికి శాంతియుత మార్గాన్ని చూపి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని తన రక్తాన్ని చిందించిన త్యాగమూర్తి, కరుణామయుడు ఏసుక్రీస్తు అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్ వద్ద గల శుభం కన్వెన్షన్ హాలులో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ఐక్యంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకష్ణ, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సంస్థ డైరెక్టర్ హసీం బేగ్, జిల్లామైనారిటీ సంక్షేమ అధికారి రబ్బాని, కార్పొరేటర్ అనిత, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు విద్యాసాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కార్యక్రమ నిర్వాహకులు కరుణ కుమారు, బెరక్క మినిస్ట్రీ డైరెక్టర్ బి.ఎస్ కిరణ్ పాల్, సెంట్రల్ చర్చి పాస్టర్ బి సుకుమార్, స్థానిక దైవజనులు టీవీ జాషువా, వెస్లీ, వై.రాజు పాల్గొన్నారు.



సెమీక్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

సాయుధ దళాల పతాక నిధికి సహకారం భేష్ : గవర్నర్

విజయవాడ : దేశ రక్షణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టిన వారి త్యాగాలను స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు మేమున్నామంటూ మనోధైర్యం కల్పించేందుకు ఉద్దేశించిన సాయుధ దళాల పతాక నిధికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమవంతు సహకారం సమకూర్చడం అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. శుక్రవారం నగరంలోని లోక్ భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమం సందర్భంగా గౌరవ గవర్నర్.. ఏపీ ఎన్‌జీజీవో నేతలను అభినందించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి తదితరులతో కలిసి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ వీర సైనికులు, వారి కుటుంబాలను ఆదుకోవడం బాధ్యతగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులు ఏటా పతాక నిధికి విరాళాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారు జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలిమిశ్రీకి సాహితీ పురస్కారం

విజయవాడ : ద్రావిడ విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతి, ఆధునిక తెలుగు నిఘంటుకర్త 'మహామహోపాధ్యాయ' ఆచార్య రవ్వా శ్రీహరి స్మారక సాహితీ పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కలిమిశ్రీకి అందజేస్తున్నట్లు అఖిల భారత పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్ తెలిపారు. మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ ద్వారా సాహితీరంగంలో మూడున్నర దశాబ్దాలుగా విరామమెరుగని సేవలందిస్తున్న కలిమిశ్రీకి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవార్డును 21వ తేదీ సాయంత్రం 5 గంటలకు విజయవాడ బందరురోడ్డులోగల ఠాగూర్ గ్రంథాలయంలో జరిగే సాహిత్య సాంస్కృతిక కార్యక్రమంలో అందజేస్తున్నట్లు ప్రకటించారు.





విద్యార్థులకు యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ పంపిణీ

విస్సన్నపేట : యుటిఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను దాత వైభవ్ జ్యువెలర్స్ అధినేత కేవి నాగేశ్వరరావు సహకారంతో నరసాపురం గురుకుల పాఠశాల విద్యార్థులకు అందించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బిసిహెచ్ వి సూర్యనారాయణ మాట్లాడుతూ ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకొని చదువు కొనసాగించాలని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం శ్యామల, యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ చంటి బాబు, ఏ మురళీకృష్ణ పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలపై అడ్వకేట్స్ ఇండియా వినతి

విజయవాడ : న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావుకు గురువారం అడ్వకేట్స్ ఇండియా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. విజయవాడలో న్యాయవాదుల ప్రతినిధి బందం ఆయనను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది వల్లభనేని పవన్, అడ్వకేట్స్ ఇండియా జాతీయ అధ్యక్షులు వంగపూరి హరిబాబు, ఉపాధ్యక్షులు జల్లి కానుక, న్యాయవాదులు ఉదయ్, హరి, నేలపాటి, రాజా, శాంతి కుమార్, ఎహేజ్ ఖేల్ పాల్గొన్నారు.



స్కూల్ గేమ్స్ అండర్ - 17 అంతర్ జిల్లా క్రికెట్ ఛాంప్ విశాఖ

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఇక్కడి గ్రీన్ ఫీల్డ్స్ మైదానంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్ – 17 బాలుర క్రికెట్ ఛాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం జిల్లా జట్టు కైవసం చేసుకుంది. ఈ జట్టు వరుసగా మూడో ఏడాది కూడా టైటిల్‌ను గెలుచుకుని హ్యాట్రిక్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్లో విశాఖ....శ్రీకాకుళం జట్టుపై 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నున్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల జట్లు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో శుక్రవారం ముగిసింది. రన్నరప్‌గా శ్రీకాకుళం, మూడో స్థానంలో తూర్పు గోదావరి జట్లు నిలిచాయి. విజేతలకు వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ నరెడ్ల సత్యనారాయణ రెడ్డి ట్రోఫీలను అందజేశారు. వీజీటీఎన్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.గోపాలకష్ణ, టోర్నమెంట్ పరిశీలకుడు భూపాల్ రెడ్డి, స్కూల్ గేమ్స్ ఎన్‌టీఆర్ జిల్లా కార్యదర్శి టి శ్రీలత, కష్ణా జిల్లా కార్యదర్శి గంప రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం

వ్యకాస జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్

విస్సన్నపేట : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం విస్సన్నపేట మండల మహాసభ స్థానిక సుందరయ్య భవనంలో రుక్మిణి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్తంగా ఉపాధి హామీ చట్టం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. అయితే ఆ చట్టాన్ని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫారెస్ట్ భూములను సీలింగ్ భూములను కారుచవుకగా పెట్టుబడుదారులకు కట్టపెట్టాలని చూస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. అనంతరం 12 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రుక్మి, కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షురాలుగా సుబ్బలక్ష్మి పార్వతి, సహాయ కార్యదర్శిగా సత్యనారాయణ, రమేష్ వెంకటస్వామి, కిషోర్ మరియమ్మ, కమిటీ సభ్యులుగా దుర్గారావు, వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్పును నిరసిస్తూ విస్సన్నపేట గాంధీ బొమ్మ సెంటర్‌లో విడిజి రామ్‌జీ 2025 పేరుతో కేంద్ర తెచ్చిన కొత్త బిల్లు ముసాయిదా ప్రతులను దగ్ధం చేశారు.



ప్రతులను దగ్ధం చేస్తున్న కోట కళ్యాణ్, నాగరాజు తదితరులు

కుటుంబ సంక్షేమాన్ని పాత్రికేయులు విస్మరించకూడదు

'ప్రెస్ క్లబ్ అమరావతి' పాస్‌పోర్టు మేళాలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ : వృత్తి జీవితంతో నిరంతరం సతమతమయ్యే పాత్రికేయులు తమ కుటుంబ సభ్యుల సంక్షేమం గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఉందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గత మూడు రోజుల నుంచి పాత్రికేయుల కోసం జరుగుతున్న పాస్‌పోర్టు మేళా కార్యక్రమం చివరి రోజు శుక్రవారం నాడు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ప్రెస్ క్లబ్ అమరావతి' వరుసగా ఆధార్, పాస్‌పోర్టు మేళాలను నిర్వహించడం హర్షణీయమన్నారు. డిజిటల్ యుగంలో ప్రతిదీ అప్‌డేట్‌గా ఉండడం చాలా అవసరమన్నారు. పాస్‌పోర్టు అధికారులతో మొబైల్ వ్యాన్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జనవరి 4వ తేదీ ప్రెస్ క్లబ్ అమరావతి సభ్యులు, వారి కుటుంబాల కోసం విజయవాడలో మొట్టమొదటిసారిగా 'సంక్రాంతి సంబరాలు' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే డ్రైవింగ్ లైసెన్స్ మేళాను నిర్వహించి, హెల్మెట్లను అందజేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. మొత్తం మూడురోజుల పాస్ట్‌పోర్టు మేళాను సుమారు 95 మంది ప్రాత్రికేయులు వినియోగించుకున్నట్లు చెప్పారు. మేళా ప్రారంభోత్సవం నాడు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి ఎస్.విజయలక్ష్మి, అసిస్టెంట్ పాస్‌పోర్టు అధికారి వి.విజయలక్ష్మి హాజరై మొబైల్ వ్యాన్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. మేళా విజయవంతానికి సహకరించిన కలెక్టర్, ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారులకు ప్రెస్‌క్లబ్ అమరావతి కార్యవర్గం ధన్యవాదాలు తెలిపింది.



పాస్‌పోర్ట్ మొబైల్ వ్యానును పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

మెడికల్ కళాశాలలపై జగన్ బెదిరింపులు దుర్మార్గం : మంత్రి కొల్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : తాము అధికారంలోకి వస్తే పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాలలను తీసుకునే వారిని జైలుకు పంపుతామని వైసిపి అధినేత బెదిరించడం దుర్మార్గమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. మచిలీపట్నంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. పలువురి సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ ప్రజలు చిచ్చుచిత్తుగా ఓడించినా జగన్మోహనరెడ్డికి ఇంకా బుద్ధిరాలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా నడచుకుంటే ప్రజలు తరిమితరిమి కొట్టడం తథ్యమన్నారు. జగన్మోహనరెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రశక్తే లేదన్నారు. మెడికల్ కళాశాలల అభివృద్ధిపై వైసిపి నేతలు విషం చిమ్మాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. దొంగ సంతకాలు పెట్టి గవర్నర్‌కు లేఖలిచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"సోగ్గాడు" సంగీత విభావరి

విజయవాడ : అలనాటి అందాల నటుడు, 'నట భూషణ' శోభన్ బాబు నటించిన "సోగ్గాడు" సినిమా విడుదలై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం గాంధీనగర్ ఆశీష్ స్టూడియోస్ లో 'బి.వి.ఆర్. ఆర్కెస్ట్రా' ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి జరిగింది. బి.రామ్మోహన్రావు ఆధ్వర్యంలో జరిగిన కచేరీలో చంద్రశేఖర్, వడ్డాది సూర్య కామేశ్వరి, ఎ.రూపాశ్రీ, కారుమంచి రాజు, మీనాకుమారి తదితరులు వివిధ సినిమాల్లోని పాటలు పాడి ప్రేక్షకుల్ని అలరించారు. కె. డేవిడ్ రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పరుచూరు విజయలక్ష్మి, సీహెచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. ట్రాక్స్ : సూర్య.

ఉల్లాసంగా 'కవిత సరాగాలు'..

విజయవాడ : "2025 కి వీడ్కోలు చెబుతూ సరదాగా పాడుకుందాం" పేరిట "కవిత సరాగాలు" (సీజన్ 3) కార్యక్రమం శుక్రవారం రాత్రి గాంధీ నగర్ ఆశీష్ స్టూడియోస్ లో ఉల్లాసంగా జరిగింది. గాయని జ్యోతి నిర్వహణలో ఎస్.ఎన్.ప్రసాద్ సహకారంతో ఏవీఎన్ మూర్తి, జై.శైలజ, సుకన్య, సరళ, జి.మంగరాజు, మున్నాభాయ్, మధుమోహన్, బాలాజీ దయాళ్, చైతుమురళి, సుమ, హరిబాబు, శ్యాంసుందర్, వెంకట్ తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు పాడిన పాటలు ప్రేక్షకుల్ని ఆనందపరిచాయి. స్టూడియోస్ అధినేతలు సత్యస్వాతి, సూర్య కూడా పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరిగింది. మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గతంలో కార్పొరేటర్‌గా పనిచేసి మరణించిన బొర్రా వెంకటేశ్వర్లు, భోగిరెడ్డి వెంకటేశ్వరరావు లకు సంతాపం ప్రకటించి కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు. నగరపాలక సంస్థ పాలకవర్గం బడ్జెట్ సమావేశాన్ని కూడా ఇప్పటి వరకు జరపకపోవడంతో గట్టిగా ప్రశ్నించాలనుకున్న తెలుగుదేశం కూటమి కార్పొరేటర్లకు ఈసారి కూడా నిరాశ ఎదురయింది.



విద్యార్థులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-చల్లపల్లి : మోపిదేవి మండలం పెదకళ్లేపల్లికి చెందిన ప్రవాస భారతీయుడు సందు నరసింహారావు తన ఉదారతను చాటుకున్నారు. తల్లిదండ్రులను కోల్పోయి చల్లపల్లి వివేకానంద డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న ఆరుగురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు చొప్పున మొత్తం పన్నెండు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని తన మిత్రుల ద్వారా శుక్రవారం అందజేశారు.



స్మార్ట్‌ఫోన్లు అందిస్తున్న ఎంఎల్‌ఎ వర్ల కుమార్ రాజా


అంగన్వాడీలకు స్మార్ట్‌ఫోన్లు అందజేత

ప్రజాశక్తి-పామర్రు : డిజిటల్ అప్‌గ్రేడ్ ద్వారా అంగన్వాడీ సేవలపై సమగ్రమైన, రియల్-టైమ్ డేటా ప్రభుత్వానికి అందుబాటులోకి వచ్చి, పథకాల మానిటరింగ్ మరింత ప్రభావవంతంగా మారుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మొవ్వ యూనిట్ కు చెందిన ప్రధాన, మినీ అంగన్వాడీ కార్యకర్తలకు 5జీ సెల్‌ఫోన్లను లాంఛనంగా అందజేశారు. జిల్లా టిడిపి ప్రచార కార్యదర్శి చాట్ల పెద రమేష్, జిల్లా యువత సహాయ కార్యదర్శి పొనుగుమాటి సందీప్, నియోజకవర్గ తెలుగు కార్యదర్శి పేదరాశి పల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియోచుక్కలు వేయించాలి : డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : చిన్నారుల భవిష్యత్తుకు పోలియో చుక్కలు తప్పక వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.యుగంధర్ తెలిపారు. పోలియో నిర్మూలన లక్ష్యంగా జిల్లాలో ఈ నెల 21న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వైద్యశాఖ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు ఒక్క చిన్నారులు మిస్ కాకుండా పోలియో చుక్క లు వేయించడమే లక్ష్యంగా యంత్రాంగం క్షేత్రస్థాయిలో అప్రమత్తమైందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రేమచంద్ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు మొత్తం 1,45,588 మంది ఉన్నట్లు అంచనా. వీరందరికీ పోలియో చుక్కలు వేయడానికి 1,94,160 డోసులను సిద్ధం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 986, పట్టణ ప్రాంతాల్లో 187 కలిపి మొత్తం 1,153 బూత్‌లలో పల్స్ పోలియో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. అదనంగా 62 మొబైల్ బూత్లు, 23 ట్రాన్సిట్ బూత్లు ఏర్పాటు చేస్తూ మొత్తం 1,238 కేంద్రాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నామన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, వాణిజ్య సముదాయాలు, పర్యాటక ప్రదేశాల్లో సంచరించే పిల్లలకు పోలియో చుక్కలు అందించేందుకు ఈ ట్రాన్సిట్ బూత్లు కీలకంగా పనిచేయనున్నాయన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : మండల పరిధిలో ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికి పోలియోచుక్కలు వేయించి చిన్నారులు పోలియోబారిన పడకుండా చూడాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం చినఓగిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి ఎన్. తేజస్విని ఆధ్వర్యంలో శుక్రవారం పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చినఓగిరాల ర్యాలీలో ఎంపిహెచ్ ఈఓ నాగార్జున బాబూరావు, సూపర్వైజర్ శ్రీనివాసరావు, ఉయ్యూరులో డిప్యూటీ ఎంపీడీఓ ఇ.హారతి నిర్మల్, ఏపీఎం అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ** : మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తొమ్మిది సచివాలయాల పరిధిలో 2062 మంది చిన్నారులకు 21 కేంద్రాల ద్వారా పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్యాధికారి సిహెచ్ రాజేశ్వరి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21 తారీకున 5 సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠినచర్యలు : డిఎస్‌పి



ప్రజాశక్తి-పామర్రు : పామర్రు సర్కిల్‌లో క్రైమ్ రేటు తగ్గిందని శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని గుడివాడ డిఎస్‌పి ధీరజ్ వినీల్ అన్నారు.వార్షిక తనిఖీలో భాగంగా ఆయన పామర్రు సర్కిల్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, పోలీసులు కలిసి మెరుగైన సమాజం కోసం బాటలు వేయాలన్నారు. ఇందులో భాగంగానే పోలీసులు ప్రజలతో మమేకమై దగ్గరగా ఉంటున్నారని అన్నారు. పామర్రు సర్కిల్ పరిధిలో క్రైమ్ రేటు తగ్గిందని గత ఏడాది 52 శాతం ఉన్న క్రైమ్ రేటు ఈ సంవత్సరం 41 శాతానికి తగ్గిందన్నారు. గ్రామాల నుండి సరైన సమాచారం పొందేందుకు మహిళా పోలీసులను నోడల్ ఆఫీసర్లుగా నియమించామని తెలిపారు. పేకాటలు, కోడిపందాలు, గంజాయి వినియోగం, బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పామర్రులోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ వి.శుభాకర్, ఎస్సైలు వి.రాజేంద్రప్రసాద్,శిరీష, ట్రైన్ ఎస్ఐ సత్యకళ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న సుంకర పద్మశ్రీ

రెండోరోజుకు నిరవధిక నిరాహారదీక్ష

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : గన్నవరం నియోజకవర్గంలోని మల్లవల్లి ఎపిఐఐసి ప్రాజెక్ట్ కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు హనుమాన్ జంక్షన్‌లో రెండవ రోజు బుధవారం ఆమరణ నిరాహార దీక్ష కొనసాగింది. ఈ నిరాహారదీక్షకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఎపిసిసి) సభ్యురాలు సుంకర పద్మశ్రీ, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు రమేష్‌బాబుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పద్మశ్రీ, చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ మల్లవల్లిలో ఎపిఐఐసికి భూములు కేటాయింపు ప్రక్రియ లో అనేక మంది రైతులు తమ సొంత భూములు కోల్పోయారన్నారు. వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో విరివిగా పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఓ కె చంద్రశేఖర రావులతో కలిసి పరిశ్రమలు తదితర అంశాల పురోగతిపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందరర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏపీఐఐసీ ద్వారా గత 2 సంవత్సరాల లోపు మల్లవల్లి, వీరపనేనిగూడెం పారిశ్రామిక వాడల్లో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులు పొంది ఇంకా యూనిట్లను ప్రారంభించని దాదాపు 400 మంది పారిశ్రామికవేత్తల జాబితా తయారుచేసి వారి యూనిట్లు వెంటనే నెలకొల్పేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఈ నెల 30వ తేదీన వారితో ఒక సమావేశం నిర్వహించి అందరిని ప్రోత్సహించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తెలుసుకొని సంబంధిత శాఖల అధికారులకు ముందుగా తెలియజేయాలన్నారు. జిల్లాలోని 20 మంది జిల్లా అధికారులను ఎంపిక చేసి పరిశ్రమలు వేగంగా నెలకొల్పు టకు ప్రత్యేక అధికారులుగా నియమించాలన్నారు. అలాగే 2 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంక పరిశ్రమలు నెలకొల్పని వారికి ఎందుకు వాటిని రద్దు పరచకూడదో తెలియజేయాలంటూ నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డిఓలు స్వాతి, జీ.బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారోన్, డి ఆర్ డి ఏ, డ్వామా, మెప్మా పిడీలు శివప్రసాద్, హరిహరనాథ్, సాయిబాబు, జడ్పీ డిప్యూటీ సీఎం ఆనంద్ కుమార్, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, డీఐసీ జీఎం ఆర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కెయులో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్: కృష్ణా విశ్వ విద్యాలయంలో క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. శుక్రవారం కోడింగ్ హబ్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు రెండు వందల మంది హాజరైన ఈ కార్యక్రమంలో కెవి. మురళీకృష్ణ, ఎం. పవన్‌లు విద్యార్థులకు స్కిల్ టెస్ట్ నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు ఐదు నెలల పాటు శిక్షణ ఇచ్చి తదుపరి ఉద్యోగ అవకాశం కల్పించనున్నారు. విశ్వవిద్యాలయ ప్లేస్మెంట్ డ్రైవ్ కోఆర్డినేటర్ ఆచార్య వైకె సుందరకృష్ణ, సహాయ ఆచార్యులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గుడివాడ : మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుడు, రాజకీయ సలహాదారుడు, కూనసాని వినోద్‌ను 1టౌన్ పోలీసులు శుక్రవారం తెలవారుజామున అరెస్ట్ చేశారు. శుక్రవారం 1టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతుండగా వినోద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు, వినోద్ వద్ద నుండి రూ. 50 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని నెప్పల్లి, గోసాల సెంటర్‌లలో తరచూ ప్రమాదాలు జరుగు తుండడంపై నాలుగు రోడ్ల సెంటర్లలో వాహనాల స్పీడు తగ్గేలాగా రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు కంకిపాడు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్ఐ సందీప్, అదనపు ఎస్ఐ తాతాచార్యులు సారధ్యంలో రేడియం స్టిక్కర్లు, డ్రమ్ములు, టైర్లను, హైవే పై ఏర్పాటు చేశారు.

గుండెపోటుతో సిపిఎం సభ్యుడు మృతి

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు) : ఉంగుటూరుకు చెందిన సిపిఎం సభ్యుడు జుజ్జువరపు మోషే (61) గురువారం రాత్రి గుండెపోటుతో చనిపోయారు. మోషే భౌతికదేహానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టీ.వి. లక్ష్మణస్వామి, మండల కార్యదర్శి ఆజ్జీర వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు పులి శ్రీనివాసరావు, పార్టీ సభ్యులు లాజరు యాకోబు, కాటూరి బాబురావు, కాలి మత్తేసు, మాతంగి సంతోష్ కుమార్,ఎల్. వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.



మృతుడి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలం పిట్టల్లంక శివారు బడేవారి పాలెంలో జనసేన పార్టీ కార్యకర్త బడే పిచ్చేశ్వర రావు ఇటీవల కరెంట్ షాకుతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ శుక్రవారం పరామర్శించారు. పిచ్చేశ్వరరావు ఆకస్మిక మృతికి తన ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పిచ్చేశ్వరరావు కుమారులు గోపి, నవీన్ లకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట జనసేన మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ మర్రె గంగయ్య, టీసీ అధ్యక్షుడు చుండూరు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు, శివాలయం మాజీ చైర్మన్ బడే పిచ్చియ్య, కూటమి నాయకులు పూతబోయిన సీతారత్న సాయిబాబు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగుల వినతి



ప్రజాశక్తి-మొవ్వ : 104 ఎంఎంయు ఉద్యోగుల సమస్యలను భవ్య యాజమాన్యం సత్వరమే పరిష్కారం చేయాలని మొవ్వ 104 సిబ్బంది శివలీల (డీఈవో) రవీంద్ర (డ్రైవర్) మొవ్వ వైద్యాధికారిణి డాక్టర్ సిహెచ్ రాజేశ్వరిని కోరారు. ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎం యుఎంప్లాయిస్ యూనియన్ పిలుపుమేరకు మొవ్వ మండలం భట్లపెనుమర్రు సబ్ సెంటర్లో శుక్రవారం నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆమెకు వినతిపత్రం అందజేశారు.

ఉపాధి హామీ చట్ట సవరణపై నిరసన

ప్రజాశక్తి-ఎ.కొండూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట సవరణపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చైతన్య నగర్, మత్రియా తండా ఉపాధి కూలీల పని ప్రదేశంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పానెం ఆనందరావు మాట్లాడుతూ వామపక్షాలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని ఎన్డీఏ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. అందులో భాగంగా మహాత్మా గాంధీ పేరు మార్చి వికసిత్ భారత్ పేరు మార్చడం గాంధీని అవమానపరచడమేనన్నారు. ఉపాధి హామీ కార్మికులను తగ్గించి యంత్రాలతో పని చేయించేందుకు కొత్త చట్టంలో పొందుపరిచారని, 40 శాతం నిధులు రాష్ట్రాలు భరించాలని చెప్పటం ఉపాధి హామీ పనిని క్రమేపి తగ్గించేందుకు చూస్తున్నారని అన్నారు. సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే ఉపాధి హామీ జాబ్ కార్డులను రెండు కోట్లకు పైగా తగ్గించి ఉపాధి హామీ పనికి బడ్జెట్ తగ్గిస్తుందని భవిష్యత్తులో ఉపాధి హామీ పని ఉండదని కూలీలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఉపాధి కూలీలకు నష్టం చేకూర్చే కొత్త జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కుమార్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకురాలు బి.జమలమ్మ, బి.సోనికి, బాలు, నాగరాజుచ వెంకి, నవీన్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గంపలగూడెం: ఉపాధి హామీ చట్టానికి పేరు మార్చడం తగదని ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి జె.వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుటుంబరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గంపలగూడెంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు అర్జీ అందజేశారు. ఇప్పటివరకు నిధులు పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం భరిస్తుండగా, అది నేడు తగ్గించుకొని రాష్ట్ర ప్రభుత్వంపై భారాన్ని మోపడం సరైనది కాదన్నారు. గతంలో లాగానే కొనసాగించాలని కోరారు.


ఎ.కొండూరులో నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు


గంపలగూడెంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ఫుట్‌బాల్ విజేత పి.బి.సిద్ధార్థ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ పోటీల్లో విజయవాడ పి.బి.సిద్ధార్థ కళాశాల పురుషుల ఫుట్‌బాల్ జట్టు చాంపియన్ షిప్ గెలుచుకోవడం పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, క్రీడా విభాగాధిపతి డా. టీవీ బాలకృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. విజయవాడలో గురు,శుక్రవారాల్లో ఆంధ్ర లయోలా కళాశాల నిర్వహణలో లయోలా మైదానంలో జరిగిన నాకౌట్ కం లీగ్ టోర్నమెంట్ లో కేబీఎన్ కళాశాలపై 2 గోల్స్, ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాలపై 2 గోల్స్, లయోలా కాలేజీపై 3 గోల్స్ కొట్టి పి.బి.సిద్ధార్థ కళాశాల మెన్స్ ఫుట్ బాల్ టీం చాంపియన్ షిప్ సాధించింది.

దుర్గమ్మ సన్నిధిలో మంత్రి ఆనం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: విజయవాడ కనకదుర్గమ్మను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు దుర్గగుడిలో మౌలిక వసతులు, ఆన్‌లైన్ సేవలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ సేవలు యాత్రికులకు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బడేటి ధర్మారావు, పి.రాఘవరాజు, ఎ.శ్రీనివాసరావు, సుకాసి సరిత, అవ్వారు బుల్లబ్బాయి, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.



రోడ్లను కమ్మేస్తున్న మంచు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామను మంచు దుప్పటి కమ్మేసింది. దీంతో ప్రధాన రహదారుల్లో ముందుగా వెళ్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు సైతం వచ్చే వరకు తెలియకపోవడంతో లైట్లు వేసుకుని ప్రయాణాలు చేస్తున్నారు. మంచు కారణంగా ఉదయాన్నే వాకింగ్ చేసే వారు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనటంతో ప్రజలు జలుబు, దగ్గుతో ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం పది గంటలు దాటినా సూర్యుడు కనిపించలేదు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

ప్రజాశక్తి-తిరువూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపకపోతే అనుకోకుండా జరిగే ప్రమాదాలకు కుటుంబం ఆదరణ కోల్పోతుందని తిరువూరు సీఐ గిరిబాబు తెలిపారు. శుక్రవారం తిరువూరు అయ్యప్ప దేవాలయం వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించిన సీఐ వాహనచోదకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపడం వల్లనే అధికశాతం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శాతకర్ణి పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-తిరువూరు: హజ్ యాత్రకు వెళ్లే పేద మధ్యతరగతి ముస్లింలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమని హజ్ కమిటీ డైరెక్టర్, తిరువూరు నగర పంచాయతీ 17వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం ఆయన ముస్లింలతో కలిసి చంద్రబాబు ఫోటోకు పాలాభిషేకం చేశారు. జీవితంలో ఒక్కసారైనా పవిత్రమైన మక్కా హజ్ యాత్ర చేయాలన్న ముస్లింల కోరికను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ రసూల్, హుసేన్, షేక్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం
ఈ నెల 29, 30, 31, తేదీల్లో హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలని సబ్ కలెక్టర్ కె.చైతన్య కోరారు. ఉరుసు నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుసు మహోత్సవానికి వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, మంచినీటి సౌకర్యం, శాంతిభద్రతలు, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా దర్గా ప్రాంగణంలో పర్యటించి సౌకర్యాలను పరిశీలించారు. ఉరుసు కమిటీ చైర్మన్ అల్తాఫ్ బాబా సబ్ కలెక్టర్‌ను సన్మానించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ బాజీ ,తాసిల్దార్ వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, కమిషనర్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.





అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-గంపలగూడెం: స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు ప్రజలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన ప్రజాదర్బార్‌లో మొత్తం 250 అర్జీలు రాగా ప్రస్తుతం అవి 120కి తగ్గినట్లు చెప్పారు. వచ్చిన ప్రతి అర్జీ పరిశీలించి, శాఖల వారీగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాజకుమారి, ఎంపీడీవో టి.సరస్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు అండగా ఒయాసిస్ ఫెర్టిలిటీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నమ్మకమైన ఫెర్టిలిటీ కేర్ అందిస్తున్న సంస్థలలో ఒకటైన ఒయాసిస్ ఫెర్టిలిటీ, కేసీ మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్తంగా వంద మంది పేద బాలికల విద్యకు స్కాలర్‌షిప్ అందిస్తుందని సంస్థ మెడికల్ డైరెక్టర్ దుర్గారావు తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ 'హ్యాపీ న్యూ ఫ్యామిలీ' ప్రచారంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన వారికి బాలికల విద్యా సంవత్సరానికి అయ్యే ఖర్చును పూర్తిగా ఒయాసిస్ ఫెర్టిలిటీ భరిస్తుందని తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-తిరువూరు: పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.17,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శాతకర్ణి తెలిపారు. మండలంలోని అక్కపాలెంలోని చెరువు కట్టపై పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్లు ఎస్సై చెప్పారు. అదుపులో తీసుకున్న ఆరుగురుపై కేసు నమోదు చేశామన్నారు.

మౌలిక వసతులపై దృష్టి సారించాలి : వసంత

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కొండపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్‌లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు వెల్లడించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. త్వరలో ఇంటింటికీ నీటి కుళాయి పథకం పనులు కూడా ప్రారంభిస్తామన్నారు.



22న తిరుమలగిరి హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీల లెక్కింపు ఈ నెల 22వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ భరద్వాజ్, ఈవో కమిషనర్ సాంబశివరావు తెలిపారు. యాత్రికులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

విద్యార్థులకు 'బ్రిటిష్ కౌన్సిల్' స్కాలర్‌షిప్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: 2026-27 విద్యా సంవత్సరానికి ప్రముఖ యుకె యూనివర్సిటీలు వివిధ రకాల సబ్జెక్టులలో 12 పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నాయని బ్రిటిష్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ ఇండియా డైరెక్టర్ రీతికా చందా తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సంస్థ ద్వారా అందించే ప్రతి స్కాలర్ షిప్ ఒక సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు కోసం ట్యూషన్ ఫీజు కోసం కనీసం రూ.10 వేలు అందిస్తున్నారు. అకాడమిక్ పరంగా అత్యుత్తమ విద్యార్థులు ప్రపంచ స్థాయి విద్య, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నైపుణ్యాన్ని పొందేందుకు వీలు కల్పిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు బ్రిటిష్ కౌన్సిల్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఇంధన పొదుపు సామాజిక బాధ్యత



ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ప్రతి పౌరుడు ఇంధన పొదుపు తమ సామాజిక బాధ్యతగా భావించాలని డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ ఎస్ఈ ఎన్.వెంకట్రావు తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల ఆవరణలో శుక్రవారం డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ సహజ వనరులు వినియోగం పెరిగి క్రమేణా అవి తరిగిపోతున్నాయని అన్నారు. భవిష్యత్తు అవసరాల కోసం పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంధన పొదుపు ద్వారా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ప్యాక్టరీ మేనేజర్ బి.హరి మాట్లాడుతూ ఇంధన పొదుపు అవగాహనలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్, డిప్యూటీ ఈఈ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు. డిఎవి పాఠశాలలో ఇంధన వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ పి.శివ రామాంజనేయులు, ఎనర్జీ మేనేజర్ బి.హరి, డిప్యూటీ సెక్రటరీ పి.శ్రీదేవి, ప్రిన్సిపాల్ మన్ మోహన్ పాల్గొన్నారు.



15 మందికి కారుణ్య నియామకాల పత్రాలు అందజేత

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారు అంకితభావంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో 15 మందికి కారుణ్య నియామకాల కింద నియామకపత్రాలు అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో 9 మంది జూనియర్ అసిస్టెంట్ పదవులకు, 6 మంది ఆఫీస్ సబార్డినేట్ పదవులకు వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయిస్తూ జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ యం నవీన్, డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కలెక్టరేట్ ఏవో రాధిక తదితర అధికారులు పాల్గొన్నారు.

22న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్-2025 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకిర్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను డిసెంబర్ 22న మచిలీపట్నంలోని లేడీ యాంప్టిల్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 25 మండలాల్లో ముందుగా మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించామని తెలిపారు. మండల స్థాయిలో నిర్దేశించిన ఏడు థీమ్‌లలో ప్రథమ స్థానంలో నిలిచిన ఏడుగురు విద్యార్థులు, అలాగే ఉపాధ్యాయ కేటగిరీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఒక ఉపాధ్యాయుడిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతి మండలం నుంచి ఎనిమిది చొప్పున మొత్తం 200 ప్రదర్శనలు ఉంటాయన్నారు. వాటినుంచి అత్యుత్తమంగా ఎంపికయ్యే 11 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు.

నైతిక విలువలతో ప్రజాస్వామ్యం బలోపేతం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రజాజీవితంలో నీతి ప్రజాస్వా మ్యాన్ని బలోపేతం చేయడంలోను, సుపరిపాలనను నిర్ధారించడంలో కీలకపాత్ర వహిస్తుందని ఎస్వీడి సిద్దార్థా లా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్ బాబు అన్నారు. ఏజీఅండ్స్ ఎస్ కళాశాల స్వర్ణోత్సవం సందర్భంగా కళాశాల ఇంగ్లీషు, తెలుగు, హిందీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాజీవితంలో నైతిక విలువలు అనే అంశంపై శుక్రవారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, సంస్థల ప్రవర్తనను నడిపించే సమగ్రత, నిజా యితీ, జవాబుదారీతనం, పారదర్శకత, నిష్పాక్షికత వంటి నైతిక విలువలు, సూత్రాలను సూచిస్తుందన్నారు. నీతిని సమర్థించినప్పుడు అవినీతి తగ్గి ప్రజల విశ్వాసం బలపడిపరిపాలన మరింత ప్రభావ వంతంగా, ప్రజా కేంకృతంగా మారుతుందని వివరిం చారు. కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్ అధ్యక్షతన జరిగిన ఈకార్య క్రమంలో ప్రత్యేక అధికారి సత్యనా రాయణ, ఆంగ్ల శాఖ అధిపతి బి.బుల్లిబాబు, వీవీ అపర్ణారెడ్డి, తెలుగుశాఖ అధిపతి ఎంఎల్ఎస్ కుమారి, హిందీ శాఖాధిపతి ఎస్ కె అన్వర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లా డుతున్న సీహెచ్ దివాకర్‌బాబు

22న ఉపాధి హామీ చట్టం సవరణలపై నిరసన

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం జి రామ్ జి పేరుతో కొత్త చట్టాన్ని తీసుకురావడం పట్ల వామపక్ష పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సాయంత్రం మచిలీ పట్నం బుట్టాయిపేట జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని ఈనెల 22వ తేదీ సోమవారం చమ్మనగిరిపేట గాంధీబొమ్మ శివాల యం దగ్గర నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈనిరసన కార్యక్రమంలో లెఫ్ట్ పార్టీల సానుభూతి పరులు ప్రజాసంఘాల నాయ కులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం నామమాత్రం కావడంతోపాటు, కొత్త బిల్లు వల్ల ఆర్థిక భారాలు మోపుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు వరకు కేంద్రం ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి పథకం అమలు చేస్తామనడం వెనుక రాష్ట్రాలు 40 శాతం నిధులు సమకూర్చుకోలేక పోతే మొత్తం ఎగనామం పెట్టడానికి కొత్త చట్టం ద్వారా కేంద్రం మార్గం సులభం చేసుకుంటుందని ఆరోపిం చారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతు ఇస్తున్న తెలుగుదేశం జనసేన పార్టీలు వి బి జి రామ్ జి పేరుతో చేస్తున్న కొత్త ఉపాధి చట్టాన్ని ఉపసంహ రించుకునేటట్లు ఒత్తిడి తీసుకురా వాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు కొల్లాటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కొడాలి శర్మ, నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, నగర కన్వీనర్ చిరువోలు జయరావు, సిపిఐ సీనియర్ నాయకులు మోదుమూడి రామారావు, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి ఈశ్వరరావు, సిపిఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యులు బి వెంకటరామయ్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఓడుగు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నేతలు



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కెయులో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : చెడును పారదోలి మంచిని ఆహ్వానించడమే క్రిస్మస్ పండుగ సందేశం అని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మన దేశంలోనీ ఈశాన్య రాష్ట్రాల్లో క్రిస్మస్ వేడుకలు అధికారికంగా నిర్వహించడం జరుగుతోందని, ఇప్పుడు అదే విధంగా మన రాష్ట్రంలో కూడా నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు. రసాయన శాస్త్ర విభాగం అధిపతి డా. సుజాత, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా. సుశీల, సహాయ ఆచార్యులు డా. అనిల్ తదితరులు ప్రసంగించారు. తొలుత రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులు పాటలు, న త్యాలు, క్రిస్మస్ సందేశం ఇచ్చేలా నాటకం ప్రదర్శించారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవిలో హెర్మోను ఐక్య కాపరుల సహవాసం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విచ్చేసి మాట్లాడారు. టి ఎస్ ఆర్ గ్రూపు అధినేత తిరుపతి శ్రీనివాసరావు, అక్షయ డెవలపర్స్ అధినేత మాదివాడ వెంకటకృష్ణ, డిసిపి కనగాల బాబురావు, మోపిదేవి తాసిల్దార్ హరినాథ్ , మోపిదేవి మండల పాస్టర్స్ ప్రెసిడెంట్ గుర్రం ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆర్‌బిఎస్‌కెతో పిల్లలకు ఉచిత వైద్య సేవలు :డిఎంహెచ్‌ఒ



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంతో (ఆర్బీఎస్కె) పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. యుగంధర్ తెలిపారు. ఆర్బీఎస్కె ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ హిమ బిందు ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, సిహెచ్ఓల ద్వారా అంగన్వా డీలు, పాఠశాలల్లో ఆరోగ్య పరీక్షలు చేపడుతున్నట్లు శనివారం మీడియాకు వివరించారు. జిల్లాలోని 1,707 అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న 1,07, 595 మంది పిల్లల్లో ఇప్పటివరకు 1,01,074 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, 14,239 మందికి వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు జిల్లాలోని 1,358 పాఠశాలల్లో ఉన్న 1,07,412 మంది విద్యార్థుల్లో 80,067 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 8,553 మందికి ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించి సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు పంపించామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యాధికారులు తిరిగి పరీక్షలు నిర్వహించగా, అంగన్వాడీ పిల్లల్లో 254 మంది, పాఠశాల పిల్లల్లో 1,684 మందికి వివిధ రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ఈ విధంగా గుర్తించిన పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, అలాగే జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం ఏర్పాటు చేసినట్లు, ఈ కేంద్రంలో నూతనంగా పుట్టిన పిల్లల నుంచి 18 ఏళ్ళ వరకు పిల్లలకు సేవలు అందిస్తున్నామన్నారు. పుట్టుకతో వచ్చే లోపాలు, బాల్య వ్యాధులు, పోషకాహార లోపాలు, ఎదుగుదల లోపాలపై ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సలు అందించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు యోగా శిక్షణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : చిన్ననాటి నుండి యోగాభ్యాసన చేయడంద్వారా ఆరోగ్యవంతులైన పౌరులుగా ఎదగవచ్చని యోగాసన స్పోర్ట్స్ అసోసి యేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెక్రటరీ పి. ప్రేమ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ ధ్యానదినోత్సవం పురస్కరించుకుని ఉయ్యూరు జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం యోగాశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా వల్ల ప్రయోజనాలు వివరించి ప్రతిరోజూ యోగాభ్యాస న చేయడం వల్ల మనస్సు ప్రశాంత, ఏకాగ్రతతో విద్యనభ్యసించ వచ్చని అసోసియేషన్ ఉపాధ్యక్షు డు దుర్గారావు అన్నారు. పాఠ శాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు అధ్యక్షతన జరి గిన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ట్రెజరర్ పి. శ్రీని వాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏఎస్ఎన్ బెనర్జీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై.నరసింహారావు

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు) : ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించే లక్ష్యంతో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై నరసింహారావు అన్నారు. బాపులపాడు మండల ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మండల కన్వీనర్ నల్లి ఆంజనేయులు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న నరసింహారావు మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం రూపొందించేందుకు, కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలనే నిర్ణయాలను ఈ మహా సభల ద్వారా ప్రభుత్వానికి తెలిరచేయాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. మహసభలు జయప్రదం కావాలని మండలంలోని అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 27న బైక్ ర్యాలీ ద్వారా ప్రచారం చేయాలని ఈ ర్యాలీలో కార్మికులు అందరు పాల్గొనాలని సమావేశం తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అబ్దుల్ బారీ, రైతు సంఘం నాయకులు తోట సాంబశివ రావు, సిఐటియు జిల్లా నాయకులు బేత శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజినాల సురేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత అఖిల భారత మహాసభల గోడ పత్రికను విడుదల చేశారు.

చిత్తజల్లు జలజకు డాక్టరేట్



ప్రజాశక్తి - గుడివాడ : మైక్రోబ యాలజీ విభాగ పరిశోధకురాలు చిత్తజల్లు జలజకి ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ లభించింది. గుడివాడకు చెందిన ఆమె శుక్రవారం వివరాలను తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ బోటని అండ్ మైక్రోబయాలజి విభాగ పరిశోధనా పర్యవేక్షకురాలు ఆచార్య ఎ.అమృతవల్లి పర్యవేక్షణలో బయోయాక్టివ్ కాంపౌండ్స్‌పై లోతైన పరిశోధన చేసి గ్రంథం సమర్పించినందుకు గాను యూనివర్శిటీ డాక్టరేట్ ఇచ్చినట్టు జలజ చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ జలజకి పలువురు అభినందనలు తెలిపారు.

రోగుల సేవలకు భంగం కలిగించం : డాక్టర్ ఆశాలత

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : జిల్లా సర్వజనా ఆస్పత్రి కి వచ్చే రోగుల సౌకర్యం కోసం ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల దగ్గర నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఔట్ పేషెంట్ స్లిప్ ఇచ్చే కౌంటర్లు నిరంతరాయంగా పనిచేస్తాయని పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఆశాలత తెలిపారు. ఓపి కౌంటర్లలో సిబ్బంది పనితీరుపై పత్రికలలో వచ్చిన కథనాలకు సంబంధించి సిబ్బందికి కఠినమైన హెచ్చరికలు జారీ చేయడంతో పాటు వివరణ కోరినట్లు తెలిపారు. రోగులకు సేవలందించే కార్యకలాపాలకు ఎటువంటి భంగం కలిగించబోమని, ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విధులకు కట్టుబడి ఉంటామని వారు హామీ ఇచ్చారని స్పష్టం చేశారు.

నేడు చల్లపల్లిలో 'ప్రజాదర్బార్'

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లిలో శనివారం 'ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎంఎం ఆనందకుమారి శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు చల్లపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రజ దర్బార్ లో ముఖ్య అతిథులుగా అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, 9వ డిఆర్ఎం కప్ ఇంటర్-డిపార్ట్‌మెంటల్ స్పోర్ట్స్ మీట్



విజయవాడలోని రైల్వే స్టేడియం, రాయనపాడులోని వ్యాగన్ వర్క్‌షాప్‌లో శుక్రవారం ప్రారంభమైయ్యాయి. డివిజనల్ రైల్వే మేనేజర్, విజయవాడ డివిజన్ సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్ మోహిత్ సోనాకియా, రాయనపాడు చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్‌తో కలిసి మీట్‌ను ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్‌లో విజయవాడ డివిజన్ ఏడిఆర్ఎంలు పి.ఇ.ఎడ్విన్, శ్రీనివాసరావు కొండా, సీనియర్ డిఓఎం (జనరల్) దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడ: బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎకె బాష, జనరల్ సెక్రెటరీ కె.వి.రంగారావు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్



వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నింగ్ బాడీతో పాటు రెండవ అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద, 3వ అదనపు జిల్లా జడ్జి భాస్కర్‌రావు , కమర్షియల్ కోర్టు జడ్జి భూపాల్ రెడ్డి, 12వ అదనపు జిల్లా జడ్జి సునీల్ కుమార్, 7వ అదనపు జిల్లా జడ్జి అబ్రహం, చీఫ్ జ్యుడీషియల్ మ్యాజిస్ట్రేట్ బెజవాడ రాధా రాణి హాజరై న్యాయవాదులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ పరిపాలనా విభాగం సిబ్బంది పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెమి క్రిస్మన్ సెలబ్రేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు పాల్గొన్నారు. అనంతరం నగర పోలీసు కమిషనర్ సెమి క్రిస్మన్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు సరిత, కృష్ణ కాంత్ పటేల్, షిరీన్ బేగం, కృష్ణ ప్రసన్న, ప్రసాద్, ఎఒ సునితా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ: రోడ్లపై చెత్త వేస్తే జరిమానా చెల్లించాల్సి వస్తోందని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు.రోడ్ల పైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి శుక్రవారం నిర్వహించే మొబైల్ కోర్టులో 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలీ లెనిన్ బాబు, శుక్రవారం ఉదయం సర్కిల్-3 కార్యాలయం పటమట నందు సర్కిల్-3 పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు నమోదు చేసిన 23 కేసులపై విచారణ జరిపి వారికి రూ.5,620 జరిమానా విధించారు.మరోసారి ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు.ఈ సందర్భంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం మాట్లాడుతూ, రోడ్లపై మాట్లాడుతూ చెత్త వేసిన మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని నగర ప్రజలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ 3 డాక్టర్ గోపాల్ నాయక్, శానిటరీ సూపర్వైజర్స్ రమేష్ బాబు, బాలాజీ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

క్రాంప్టన్‌కు ఇంధన పరిరక్షణ అవార్డు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (సీజీసీఈఎల్) ఇంధన సామర్థ్యానికి సంబంధించి పరిరక్షణ అవార్డ్ లభించిందని సంస్థ సిఈవో ప్రమోట్ ఘోష్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. స్టేషనరీ స్టోరేజ్ టైప్ ఎలక్ట్రిక్ వాటర్ హీటర్ విభాగంలో ఇంధన పరిరక్షణకు కంపెనీ చేసిన అత్యుత్తమ తోడ్పాటును గుర్తిస్తూ న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో క్రాంప్టన్‌కు అవార్డ్ ప్రకటించారన్నారు. ఈ విజయం సంస్థ సాంకేతిక నైపుణ్యాన్ని గుర్తించడమే కాకుండా జాతీయ ఇంధన పరిరక్షణ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో క్రాంప్టన్ పాత్రను కూడా ప్రముఖంగా చాటి చెబుతుందని తెలిపారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీ ఏర్పాట్లతో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందరరేగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 966 పోలియో బూత్‌ల పరిధిలో దాదాపు 2,48,900 మంది సున్నా నుంచి అయిదేళ్లలోపు పిల్లలు లక్ష్యంగా పల్స్ పోలియో నిర్వహించడం జరుగుతుందని.. వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్, ప్రజా రవాణా, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. 611 గ్రామీణ బూత్‌లు, 355 అర్బన్ బూత్‌లు, 71 మొబైల్ బృందాలు, 35 ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రత్యేక బ ందాలు సేవలందిస్తాయన్నారు. ఈ నెల 21న బూత్ స్థాయిలోనూ.. ఈ నెల 22, 23వ తేదీల్లో ఇంటింటి సర్వే ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేలా అధికారులు చూడాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై ఇప్పటి నుంచే వివిధ మార్గాల ద్వారా అవగాహన కల్పించాలని.. ముఖ్యంగా హైరిస్క్ ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు తదితర చోట్ల కూడా పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సూపర్వైజరీ అధికారులు కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతమయ్యేలా చూడాలని ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ఇమ్యునజైషేన్ జరిగేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, డా. సునీల్, డా. జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి తరం వ్యాపారులకు ఆదర్శం సుబ్బారావు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: 75 సంవత్సరాలకు పైబడి వ్యాపార రంగంలో అగ్రస్థానంలో నిలిచిన మాజీ మున్సిపల్ చైర్మన్, విద్యావేత్త శ్రీరాం సుబ్బారావు నేటి తరం వ్యాపారులకు ఆదర్శమని పలువురు వర్తక వ్యాపార ప్రముఖులు, వక్తలు కొనియాడారు. సుబ్బారావు స్టార్ ఆఫ్ ఏపీ 2025 పురస్కారాన్ని అందుకున్న సదర్భంగా జగ్గయ్యపేట వెండి బంగారు, రాళ్ల, నగల, వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి అభినందన సభ నిర్వ హించారు. ఈ సందర్భంగా సుబ్బారావు దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శ్రీ రాం చిన్న జయరాముడు, విశ్వనాథం సోదరులు జగ్గయ్యపేట బంగారపు వ్యాపారాన్ని రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని, అదే సాంప్రదాయాన్ని విలువలను పాటిస్తూ శ్రీరాం సుబ్బారావు వ్యాపారాన్ని మరింత విస్తరింప చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొర్రా మల్లేశ్వరరావు, కార్యదర్శి గొల్లపూడి వెంకటకృష్ణారావు, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, యునైటెడ్ ఎగ్జిబిషన్ ఆర్గనైజర్ సత్యసాయి చైతన్య, నియోజకవర్గ టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం చినబాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, షరాబు వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి కొంకిమళ్ళ మల్లికార్జునరావు, రాష్ట్ర నాయకులు మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గత మూడు రోజులుగా నందిగామ డివిజన్ ఉపాధ్యాయుల ఆటల పోటీలలో భాగంగా జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా జరిగాయి. మొత్తం ఏడు టీములు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో వీరులపాడు మండలం, జగ్గయ్యపేట మండలం పోటీ పడగా అనూహ్యంగా వీరులపాడు మండలం గెలుపొందింది. కార్యక్రమాన్ని ఆర్గనైజింగ్ చేసిన చిల్లకల్లు పీడీ గంట వెంకటేశ్వరరావును మండల విద్యాశాఖ అధికారి ఎల్.చిట్టిబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో భీమవరం హెచ్ఎం రాంబాబు నాయక్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట గ్రామ హైవే సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. తెలంగాణకు చెందిన పొందూరు ప్రసాద్, భార్య, కుమారుడితో కలిసి విజయవాడ నుండి ఖమ్మంకు వెళుతున్న సమయంలో కారు అదుపు తప్పి ఫల్టీ కొట్టింది. సీటు బెల్టు పెట్టుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జగ్గయ్యపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: దుర్గగుడి శుక్రవారం యాత్రికులతో అత్యంత రద్దీగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో దుర్గమ్మ ఆలయంతో పాటు మల్లికార్జున స్వామి ఆలయం, ఉపాలయాలు కిటకిటలాడాయి. ప్రకాశం జిల్లా పుల్లెల చెరువుకు చెందిన బ్రహ్మానందరెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,01,116/, విశాఖపట్నం గాజువాక పీతల సునీల్‌కుమార్, లక్ష్మి కుటుంబ సభ్యులు లక్ష రూపాయలు, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన కొండిశెట్టి వెంకట విఠల్ భాస్కర్ కుటుంబ సభ్యులు రూ.1,00,116 నగదును అన్నదాన పథకానికి విరాళాలుగా అందజేశారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కంచికచర్ల:

రోడ్డుపై ప్రయాణించేటప్పు రోడ్డు భద్రతా నియమాలతో పాటు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని ఆటో డ్రైవర్లు కు స్తానిక ఎస్సై నాని నరేందర్ సూచించారు. స్తానిక జుజ్జురు రోడ్డులోని ఆటో స్టాండ్, ఆటో డ్రైవర్లకు ఎస్ఐ నాని నరేందర్ కౌన్సిలింగ్ శుక్రవారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలను అతివేగంగా నడపరాదని హెచ్చరించారు.ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. రోడ్లపైన ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంఎన్ఎస్‌కు పురస్కారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: జాతీయ శక్తి సంరక్షణలో ఎఎంఎన్ఎస్ సంస్థ ఉత్తమ నవీనత పురస్కారాన్ని సాధించి నట్లు సంస్థ ప్రతినిధి ఎస్ .రమణ ఒక ప్రకటనలో తెలిపారు. శక్తి సామర్థ్యం, పర్యావరణ పరిరక్షణలో తన నాయకత్వాన్ని చాటుకుందన్నారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాణి అందుకున్నట్లు తెలిపారు. హాజీరాలోని ఉక్కు తయారీ కర్మాగారంలో అమలు చేసిన ఆధునిక భట్టీ సాంకేతికత ద్వారా విద్యుత్ వినియోగాన్ని పది శాతం వరకు తగ్గించినట్లు తెలిపారు. సంవత్సరానికి యాభై ఆరు వేల నాలుగు వందల మెగావాట్ గంటల శక్తి పొదుపు సాధించడంతో పాటు నలభై ఒక వేల ఏడు వందల టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించినందుకు ఈ పురస్కారం లభించిందని తెలిపారు. ఈ విజయం దేశం లక్ష్యంగా పెట్టుకున్న 2070 నాటికి శూన్య కార్బన్ లక్ష్యాలకు అనుగుణంగా సంస్థ నిబద్ధతను మరింత బలపరుస్తోందని తెలిపారు.



33 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : హైదరాబాదుకు చెందిన ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ సీ ఓక్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైనట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి కష్ణవేణి చెప్పారు. తమ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న 33 మంది విద్యార్థులు రూ.8 లక్షల వార్షిక వేతనంతో ఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు అందరికీ తక్షణ నియామక ఉత్తర్వులు కంపెనీ అందజేసిందన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ పి శ్రీనివాసు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వెంకటేశ్వ్రరావు, డాక్టర్ కే రామకృష్ణ, పి ఎల్ రమేష్ విద్యార్థులను అభినందించారు.

క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో ఎన్‌టిఆర్ జిల్లాకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-విజయవాడ: క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో రాష్ట్ర స్థాయిలో ఎన్‌టిఆర్ జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు ప్రథమ స్థానంలో నిలిచినందున రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతులమీదుగా ఎబిసిడి అవార్డ్‌ను నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు శుక్రవారం అందుకున్నారు.రాష్ట్ర డిజిపి ప్రధాన కార్యాలయంలో నేర పరిశోధన రంగంలో, కేసుల త్వరితగతిన పరిష్కారానికి అధునాతన విధానాలను పాటించి, వినూత్న మార్గాలను అనుసరించిన పోలీస్ అధికారులను గుర్తించి వారిని ఎబిసిడి (అవార్డ్ ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్)అవార్డ్స్ ద్వారా డిజిపి హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం అభినందించి సత్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈఏడాది మొదటి త్రైమాసానికి ఉత్తమ ప్రతిభ కనబర్చిన కేసుల పూర్వాపరాలను, కేసుల పరిష్కారంలో వినియోగించిన సాంకేతిక పద్దతులను, వినూత్న విధానాలను సిఐడి-డీజీపి



డిజిపి నుంచి అవార్డు అందకుంటున్న సిపి రాజశేఖరబాబు

రవిశంకర్ అయ్యన్నార్ పరిశీలించారు. అవార్డును రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ చేతులు మీదుగా పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖరబాబు, క్రైమ్ డిసిపి కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏడిసిపి ఎం.రాజారావు, ఇన్స్పెక్టర్ ఎం.రాంకుమార్ అందుకున్నారు.

నేటి నుంచి ఆర్‌టిసి కార్గో పార్సిల్ సర్వీస్ డోర్ డెలివరీ మాసోత్సవాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఏపీఎస్‌ఆర్టీసీ కార్గో పార్సెల్ సర్వీస్ డోర్ డెలివరీ మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అవనిగడ్డ డిపో నందు కూడా డోర్ డెలివరీ సదుపాయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుండి జనవరి 19వ తేదీ వరకు నెలరోజుల పాటు డోర్ డెలివరీ మాస ఉత్సవాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డోర్ డెలివరీ సదుపాయం గురించి విస్తృతంగా కస్టమర్లకు తెలియజేయడం, వివరించడం తోపాటు డోర్ డెలివరీ పార్సెల్ సర్వీస్ను అభివృద్ధి చేయుటకు చేపట్టే కార్యక్రమాల గురించి వివరించారు. అవనిగడ్డ, దసరా ప్రాంత కస్టమర్లు ఏపీఎస్‌ఆర్టీసీ డోర్ డెలివరీ సదుపాయం వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కోరారు. ఇతర వివరాలకు 96526101 74, 91965 2813577 నెంబర్లను సంప్రదించాలన్నారు.



శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న సత్యభామ

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - గుడివాడ : మహిళలు ఒక క్రమ పద్ధతిలో పనిచేస్తే తమ కలలను సాకారం చేసుకో వచ్చని డిపిఎంఐబి యన్. సత్యభామ అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి విజన్ బిల్డింగ్ మోడ్యూల్ 2పై శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా మోడల్ మండలం లక్ష్యానికి స్వచ్ఛమైన, పరిశుభ్రమైన, సంతోషకరమైన, ఆరోగ్యకరమైన, ఆనందకరమైన, జీవనోపాధి కోసం, నందన బృందావన ఆదర్శ సమాఖ్యగా ఉండాలని శిక్షణా తరగతిలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులలో టిఓటిలు సిహెచ్ విజయ్ కుమార్, కే ఏసుదాస్, మండల సమాఖ్య ప్రెసిడెంట్ పి లక్ష్మి, సీసీలు కె జ్యోతి, పి రత్న మిరియం, గ్రామైక్య సంఘాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విఘ్నేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3,72,657

ప్రజాశక్తి-గుడివాడ : మెయిన్‌రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో హుండీ లెక్కింపును శుక్రవారం దేవాదాయ శాఖ అధికారులు నిర్వహించారు. రూ.3,72,657 రూపాయల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన లెక్కింపులో దేవస్థాన ధర్మకర్తల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని హుండీలో వచ్చిన నగదు లెక్కించారు. మూడు నెలల కాల వ్యవధిలో లెక్కింపు చేపట్టినట్లు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. దేవస్థాన ఈవో యార్లగడ్డ వాసు, దేవస్థాన ధర్మకర్తల కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం :ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కంకిపాడు : కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజల్లోకి విరివిగా తీసుకువెళ్లేలా కృషి చేయాలని బోడే ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండల పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన జంపని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మొదటి విస్తృత స్థాయి సమావేశంలో కంకిపాడులో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, మార్కెట్ యార్డ్ చైర్మన్ అనే దానయ్య, బీసీ సెల్ అధ్యక్షులు సంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం పేరు మార్పుపై నిరసనలు

ప్రజాశక్తి - గుడివాడ : గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చూస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేయటం దారుణమని సిపియం పట్టణ కార్యదర్శి అర్‌సిపి రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ బొమ్మవద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం అమలులోకి వస్తే దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పోరేట్ శక్తులకు 19 లక్షల రూపాయలు రాయితీలు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రజిని, లంక సురేంద్ర, ఆర్.కొండ, పి.వీరమ్మ, ఎ.విజయ్‌కుమార్, ఎం.నారాయణ, ఎస్ శ్రీనివాస్, కె.సురేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు)** : కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం పేరు మార్పు చేస్తూ ఇచ్చిన సర్కిలర్ ను వ్యవసాయ కార్మిక సంఘం లంకపల్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దగ్ధం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జయరాజు, సంఘ నాయకులు సాంబశివరావు, మధు, ఇస్మాయిల్, నాని పేరతోటి చంటి తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో...




లంకపల్లిలో...

శ్మశాన భూమిని కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-ఉయ్యూరు : బోళ్లపాడు దళిత కుటుంబాలకు శ్మశాన వాటిక స్థలం భూమిని కేటాయించాలని సిపిఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి రాజేష్ అన్నారు. శుక్రవారం ఆర్డిఓ ఆఫీస్ డిప్యూటీ తాహసిల్దార్ శ్రీనివాసరావుకి శ్మశాన వాటిక స్థలం ఇవ్వాలని అర్జీ అందవించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ బోళ్లపాడు దళిత పేటకు శ్మశాన వాటిక స్థలము లేక దళితులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. స్మశానానికి స్థలం లేకపోవడంతో దళిత కుటుంబాలు ముదునూరు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు మార్గంలో రెండు సెంట్లు స్మశాన వాటిక భూస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా దళిత కుటుంబాలకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకురాలు బి కీర్తి స్మశాన పోరాట కమిటీ సభ్యులు జి కుమారి విజయకుమారి అరుణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం



కుట్టుమిషన్ అందిస్తున్న ఎంఎల్ఎ

ప్రజా సమస్యల కోసమే 'ప్రజాదర్బార్'

ప్రజాశక్తి-పామర్రు : నియోజకవర్గ అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు.శుక్రవారం పామర్రు టౌన్ - 4 కార్యాలయం వద్ద ప్రగతి పథంలో పామర్రు-ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా దర్బార్‌లో మొత్తం 21 సమస్యలు నమోదు కాగా, వాటిలో 9 సమస్యలకు అక్కడికక్కడే తక్షణ పరిష్కారాలు అందించారు. మిగతా ఫిర్యాదులను సంబం ధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పి-4 పథకం ద్వారా మండల పరిధిలోని కొండిపర్రు గ్రామం ముదునూరు సువర్ణరాజుకి 5వేల రూపాయల చెక్కును, పామర్రు టౌన్ షేక్ బీజన్ బి గారికి కుట్టు మిషన్ ను అందచేశారు. జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, పామర్రు పట్టణ టిడిపి అధ్యక్షులు పరసా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు పోలీస్ స్టేషన్లో అవనిగడ్డ డిఎస్పి తాళ్లూరి విద్యాశ్రీ శుక్రవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ రికార్డులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ యువకుమార్, కోడూరు సబ్ ఇన్స్పెక్టర్ చాణిక్య, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాగోలులో అన్నసమారాధన

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం పాగోలులోని శ్రీకైవల్యాశ్రమ ప్రాంగణంలో శ్రీకమలాత్మికా సహిత అచలేశ్వర మందిర కుంభాభిషేకం, శ్రీసదాశివమూర్తి విగ్రహ ప్రతిష్టాపన శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉదయం విఘ్నేశ్వరపూజ, మహావిద్య హెూమం నిర్వహించారు. సదాశివమూర్తి విగ్రహ ప్రతిష్ట,శిఖర కుంభాభిషేకం జరిగింది. అచలేశ్వరస్వామి శాంతి కళ్యాణ మహెూత్సవం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు మేకా బంగారుబాబు, చాపరాల గాంధీప్రసాద్, వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శివరుద్రస్వామి, విద్యాసాగర్ స్వామి వంటి స్వామీజీ, ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

పోషకాహారానికి సరుకులు అందజేత

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలంలోని మల్లవోలు హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు జనసేన పార్టీ కార్యకర్తల తరఫున ముద్దినేని వెంకటేశ్వరరావు ప్రతిరోజూ టిఫిన్‌గా పెట్టేందుకు ఉప్మా, రవ్వ, సెనగల సరుకులు శుక్రవారం హైస్కూల్‌లో అందజేశారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పోషకాహారం అందించి వారి ఆరోగ్యం, చదువుపై దృష్టి పెట్టాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళి, ముద్దినేని వెంకటేశ్వర రావు, పడవల మోహన్ త్రినాథ్, జరుగు కృష్ణమ్మ, ప్రత్తిపాటి స్వామి తదితర మల్లవోలు గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిడిపివో పద్మావతి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : సిడిపిఒ

ప్రజాశక్తి - గుడివాడ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని ఎం పద్మావతి పేర్కొన్నారు. గుడివాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గుడివాడ రూరల్ మండలం చౌటపల్లి హైస్కూల్‌లో బాలివివాహాల ఆంధ్ర ప్రదేశ్ వంద రోజులు కార్యక్రమంలో భాగంగా కిషోర్ బాలికలకు అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిడిపివో పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహం బాలబాలికల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని, విద్యను దెబ్బతీస్తాయని సూచించారు. ఇలాంటి వాటిని ఎవరు ప్రోత్సహించరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిపియు సెక్షన్ నుండి సిహెచ్ చంద్రమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగ శిరీష, హైస్కూల్ హెచ్‌ఎం బి శ్రీలక్ష్మి, అంగన్వాడి వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కంకిపాడు : రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్ పుట్టినరోజు సందర్భంగా పోరంకిలోని టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. స్థానిక శాసనసభ్యులు బోడె ప్రసాద్ గోపించ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్‌రావు, రాష్ట్ర దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ బాలాజీ, రాష్ట్ర సగర వెల్ఫేర్ అండ్ డెవ లప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరాస్వామి, రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని పెదపారుపూడి చెరువుగట్టు వద్ద నుండి జువ్వనపూడి, అప్పికట్ల, ముదునూరు గ్రామాల మీదగా కాటూరు వెళ్ళు రోడ్డుకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ఆర్ అండ్ బి డిఈ బలరాం, ఏఈ మల్లికార్జున రావు, ఎంపీడీవో విమాదేవి, టిడిపి ఎస్‌సి విభాగం మండల శాఖ అధ్యక్షుడు పాగోలు కాటన్ రాజు, గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా కిషోర్ పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాశక్తి-అవనిగడ్డ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మక "బిజినెస్ రెఫార్మర్ ఆఫ్ ద ఇయర్ 2025"ద ఎకనామిక్ అవార్డుకు ఎంపికకావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అవనిగడ్డలో నియోజకవర్గ కూటమి నాయకులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శుక్రవారం రాజీవ్ సెంటర్లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకట్రావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చిలకలపూడి పాపా రావు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి. వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు బండే శ్రీనివాసరావు, బండే రాఘవ, పర్చూరి. దుర్గా ప్రసాద్, తెలుగు మహిళా నాయకులు బండే కనకదుర్గ పాల్గొన్నారు.

ఎంఎల్‌ను కలిసిన ఎఎంసి పాలకవర్గం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎట్టకేలకు ఖరారైంది. సోమవారం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది.



ఈ సందర్భంగా ఎఎంసి నూతన చైర్మన్ పిట్టల శ్రీ దేవి, వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాల, డైరెక్టర్లు శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. నందిగామ మార్కెట్ యార్డ్ చైర్మన్ పిట్టల శ్రీదేవి, వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలాప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ మార్కెట్ యార్డ్ అభివృద్ధి కోసం సమన్వయంతో పని చేయాలని, రైతులకు న్యాయం కలిగేలా పాలకవర్గం కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ పాలకవర్గ డైరెక్టర్లు కొఠారు దశరథరామయ్య, సూర సత్యనారాయణ, కొల్లి లక్ష్మీ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మైలవరం: మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ ఆధ్వర్యంలో రూపొందించిన



నూతన సంవత్సర కేలండర్‌ను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏడాది క్రమం తప్పకుండా కేలండర్ రూపొందిస్తున్న లంకా లితీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యలో ముందుకు సాగాలనే లక్ష్యంతో ఎంఎన్ఆర్ ఫౌండేషన్



ఆధ్వర్యంలో మద్దులపర్వ ఎపి మోడల్ స్కూల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు, కెరీర్ గైడెన్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పిడి నాగేశ్వరరెడ్డి, బొమ్మిన కోటేశ్వరరావు, సోమేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు ప్రకాష్ పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: నగరపాలక సంస్థకు స్వచ్ఛ అవార్డు వచ్చిన సందర్భంగా 50వ డివిజన్లోని 35 మంది పారిశుధ్య కార్మికులకు విఎంసి తరపున కార్పొరేటర్ సత్యబాబు శుక్రవారం దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల శ్రమను సత్యబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం : గద్దె

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రతి సమస్యకూ పరిష్కారం



చూపుతామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో ప్రజాదర్బార్‌ను శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. 14వ డివిజన్‌కు చెందిన గవిడి వంశీకి కళాశాల ఫీజు నిమిత్తం రూ.15 వేలను ఎమ్మెల్యే తన సొంత నిధుల నుంచి అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ జోనల్ కమిషనర్ షమ్మి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎం.దుర్గాశాంతి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఎనర్జీ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

2029 నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ తుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీల భారం తగ్గాలంటే ప్రతి ఒక్కరూ సోలార్ను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. బందర్ రోడ్డులోని ఎ కన్వెన్షన్ సెంటర్లో ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సోలార్ రీనబుల్ ఎనర్జీ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను నెడ్ క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్ బాబుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. సుమారు 50 సోలార్ ఎనర్జీ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ప్రతి స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించి సోలార్ ఎనర్జీ ఏవిధంగా పనిచేస్తుంది, వాటి ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గద్దె మాట్లాడుతూ 2029 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటిపై సోలార్ను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం అడుగు వేస్తోందన్నారు. ఎస్సీ ఎస్టీలకు బీసీలకు సబ్సిడీలు ఇస్తోందని వాటిని సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై సోలార్ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నెడ్ క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్‌బాబు మాట్లాడుతూ విద్యుత్తు డిమాండ్ దృష్ట్యా ప్రజలందరూ తమ ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోవాలని తద్వారా విద్యుత్తు డిమాండ్ తగ్గడంతో పాటు విద్యుత్తు ఛార్జీల భారం తగ్గుతుందన్నారు. ఎపి సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షులు హేమకుమార్ మాట్లాడుతూ సోలార్ ఎనర్జీ ప్రదర్శన 19, 20, 21 తేదీల్లో



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

జరుగుతుందని, ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద సోలార్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరికి 50 గ్రాముల వెండి కాయిన్ ఉచితంగా అందజేస్తున్నామని, ఐదు సంవత్సరాల ఉచిత సర్వీస్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తేజ ,ఉపాధ్యక్షులు నాగరాజు, కోశాధికారి జయబాబు, సభ్యులు చందు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: వేగంగా మారుతున్న కాలంతో పోటీపడి నిలదొక్కుకోవాలంటే సాంకేతిక పరిజ్ఞానంలో నూతన పోకడలు అందిపుచ్చుకోవాలని, ఎప్పటికప్పుడు నవీనంగా లేకపోతే విద్యార్థికైనా, ఉద్యోగికైనా భద్రత, భవిష్యత్ ఉండవని గన్నవరం హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ జనరల్ మేనేజర్, ఏఐ క్లబ్ అధ్యక్షులు బొర్రా సురేశ్ బాబు అన్నారు. విజయవాడ పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థి సంఘం శుక్రవారం సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన బ్లిట్జ్ క్రీగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన వివిధ కళాశాలల విద్యార్థులతో ఆడిటోరియం హోరెత్తింది. కళాశాల ప్రిన్సిపల్ డా. మేకా రమేశ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా.రవికిరణ్, ఉప విభాగాధిపతి కోనేరు సుధీర్, డీన్ ప్రొఫెసర్ రాజేశ్ జంపాల మాట్లాడుతూ ప్రపంచ రూపురేఖలను మార్చిన కంప్యూటర్ విజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం సురేష్‌బాబును సత్కరించారు. ఈ పోటీలు సహ సమన్వయకర్త, కళాశాల ఉపాధి శిక్షణా విభాగాధిపతి కావూరి శ్రీధర్ మాట్లాడుతూ 2006 నుంచి బ్లిట్జ్ క్రీగ్ పేరుతో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తూ సృజనాత్మకత దిశగా ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం పత్ర సమర్పణ, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, కోడింగ్ అండ్ డీకోడింగ్, నిధి అన్వేషణ, స్పాట్ ఫోటోగ్రఫీ, మిస్టర్ అండ్ మిస్ బ్లిట్జ్ క్రీగ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. సిద్ధార్థ విద్యార్థులు ఫ్యాషన్ షో, ఆటపాటలతో ఉర్రూతలూగించారు.

రేపు యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-తిరువూరు: యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఈ నెల 21న తిరువూరులోని లక్ష్మీపురం మను గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచురణల కమిటీ మెంబర్ ఎన్ ముత్తయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.అపర్ణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకటస్వామి, పి.నాగేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 18 నెలలు అయినా పరిష్కారానికి చర్యలు తీసుకోలేదన్నారు.



నూతన అధ్యక్ష, కార్యదర్శులు

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-వత్సవాయి: వత్సవాయి మండల కేంద్రంలో యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా అజ్మీర్ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా కల్లేపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మన్నేపల్లి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి సదానంద, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-తిరువూరు

ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని కౌన్సిలర్ మోదుగు ప్రసాదు సూచించారు. తిరువూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రేష్మా బేగం ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పది వార్డుల పరిధిలో వైద్యారోగ్య సిబ్బంది మురుగు కాలువలు, డ్రైనేజీలు శుభ్రం చేయించి, దోమల లార్వా వృద్ధి చెందకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రమాదేవి, హెల్త్ సూపర్వైజర్ కే రవి, హెల్త్ విజిటర్ శ్యామల పాల్గొన్నారు.

శ్రీ విద్యా హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నందిగామ: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని బిషప్ అజరయ్య గర్ల్స్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన



జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో నందిగామ శ్రీ విద్యా హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల చైర్మన్ కందుల మల్లికార్జునరావు తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఎన్.సాత్విక
(ఇంగ్లీష్ మీడియంలో) ప్రథమ బహుమతి, పి.సాత్విక్ (తెలుగు మీడియంలో) ద్వితీయ బహుమతి సాధించారు. ఈ నెల 23న విశాఖపట్నంలో జరగబోయి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ మేకల రాము, ప్రిన్సిపాల్ ఐ.చిన్న జోస్ అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి : సత్యబాబు

ప్రజాశక్తి-విజయవాడ, సిటీ: విజయవాడ జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలను తక్షణమే చెల్లించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బి.సత్యబాబు కోరారు. ఈ మేరకు నగర కమిషనర్ ధ్యానచంద్ర, ప్రజారోగ్య విభాగం ముఖ్యఅధికారి డాక్టర్ కె.అర్జునరావుకు వేర్వేరుగా వితిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ కార్మికులకు వేతనాలను తక్షణమే ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలని, లేకపతే కార్మికులను కలుపుకొని ఉద్యమించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పలు సార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. జక్కంపూడి కాలనీ, విఎంసి ప్రధాన కార్యాలయం ఏరియాల్లో నెలల తరబడి కార్మికులతో పని చేయించుకుంటూ ప్రవేట్ కాంటాక్ట్ సంస్థల వారు వేతనాలు చెల్లించకుండా కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి



సిఎంఒహెచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ల వ్యవహార తీరుపై నగరపాలక సంస్థ అధికారులు వెంటనే స్పందించి కార్మికుల వేతనాలు చెల్లించే దానికి కృషి చేయాలని కోరారు. జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో ఎం/ఎస్ యశ్వంత్ ఫెసిలిటీ సర్వీసెస్ ప్రైవేట్ కాంట్రాక్ట్ సంస్థ వారు కార్మికులకు నవంబర్ నెల వేతనము ,పిఎఫ్ ,ఈఎస్ఐ నిధులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అలాగే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు అక్టోబర్ నెల వేతనం యం/ఎస్ యశ్వంత్ ఫెసిలిటీ సర్వీసెస్ సంస్థ వారు , నవంబర్ నెల వేతనం ఎం/ఎస్ కనకదుర్గ మాన్ పవర్ సర్వీసెస్ ప్రైవేట్ కాంట్రాక్ట్ సంస్థల వారు చెల్లించడం లేదన్నారు. దీనిపై సిఎంఒహెచ్ డాక్టర్ అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వేణుగోపాల్ స్పందిస్తూ సదరు కాంట్రాక్టు సంస్థ నుండి వేతనాలు చెల్లించే విధంగా కృషి చేస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు.

విజయవాడ జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు ఆధ్వర్యంలో శుక్రవారం వైయస్సార్ కాలనీ శానిటరీ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.సాంబశివరావు, బి.మల్లేష్, ఎం.దుర్గా, అప్పారావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.